# తనకోసమే కాదు...

-పి.వి.రమణ

కిటికీలోంచి నారింజకిరణాలు కళ్లమీద పడ్డంతో ఉలిక్కిపడి నిద్రలేచాడు సీతాపతి. చీకట్లను తొలగిస్తూ విచ్చుకుంటున్న ఆ వెలుగు ఒక్కక్షణం కొత్తగా కనిపించింది. ఎదురుగా ఉన్న దేవుని పటాలవైపు ఒక్కసారి చూసి అరచేతిపై ఓంకారాన్ని రాసుకుని లేచి మంచం మీద కూర్చున్నాడు. అంతలోనే ఎదురుగా వరాలిచ్చే దేవతలా ప్రత్యక్షమైంది మంగతాయారు కాఫీ కప్పుతో.

తలస్నానం చేసి క్లిప్ పెట్టుకున్న జుత్తునుండి నీరు బొట్లుబొట్లుగా రాలుతోంది. వంగపండురంగుపై కుంకుమరంగు బోర్డరున్న పట్టుచీరలో ఒదిగిపోయి పగటపూట ఉదయించిన నిండు పున్నమి జాబిలిలా ఉన్న భార్యామణిని అదే మొదటిసారిగా అన్నట్లుగా కన్నార్పకుండా చూస్తుండిపోయింది.

"ఏంటండీ! ఈరోజు కొత్తగా వింతగా చూస్తున్నారు? ముందు కాఫీ త్రాగండి" అంటూ కప్పును అందించింది తాయారు.

"ఊహూం....ఈరోజు నుండి బెడ్‌కాఫీ తాగను"

"మరి..." ఆశ్చర్యంతో విప్పారిన నేత్రాలు మరింత అందాన్ని సంతరించుకున్నాయి.

"మరి..అంటే...ఇలా..." అంటూ ఒక్కుదుటున తాయారుని ఒళ్ళోకి లాక్కున్నాడు.

"ఛీ....ఏంటిది? మరీ చిన్నపిల్లాడిలా.." సిగ్గుతో చెంపలు కెంపులు అవుతుండగా జారిన పైట చెంగును నడుం చుట్టూ చుట్టూకుంటూ అంది.

"అవునోయ్! ఈరోజునుండి నేను మళ్ళీ చిన్న పిల్లాడినైపోతాను"

"ట్రింగ్...ట్రింగ్..." ఆమాటలు జయం అన్నట్లుగా ప్రాణం పోసుకుంది టెలిఫోన్.

"హలో"

"హలో నాన్నగారూ! ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు" మణికంఠ గొంతు ఫోన్‌లో ఖంగుమంది.

"ధన్యవాదాలు" అన్నాడేగానీ గొంతులో చిన్నని జీర.. కళ్లలో సన్నని నీటిపొర.

"ఎవరండీ మణికంఠేనా? ఇలా ఇవ్వండి" అంటూ భర్త చేతిలోని రిసీవర్ దాదాపుగా లాక్కుంది.

"ఏరా? నువ్వొస్తావని ఇక్కడ మేమంతా ఎదురుచూస్తుంటే ఇలా చేసావేంట్రా?" మాటలలో బాధ మిళితమైంది.

"సారీ అమ్మా! ఎంత ప్రయత్నించినా వీలు కుదరలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గానీ ఎవరికీ సెలవు ఇచ్చేది లేదని మా కంపెనీ ఖచ్చితంగా చెప్పేసింది. ఏం చెయ్యను? ఆం....అన్నట్లు డబ్బుల కోసం వెనకాడకుండా మొత్తం ఫంక్షన్‌ని అంతా వీడియో తీయించి సీడీలు నాకు పంపండేం" మణికంఠ ఇంకా ఏదో మాట్లాడుతున్నా కూడా తాయారు రిసీవర్ క్రెడిల్ చేసేసింది.

మౌనంగా వెళ్లి భర్త పక్కన కూర్చుంది. ఆమె కళ్లల్లో సన్నని నీటిపొర.

"తయారూ! ఛ... ఎందుకలా బాధపడతావు? ఇప్పుడేమయ్యిందని? వాడు చేస్తున్న ఉద్యోగం అలాంటిది మరి. వాడికి మాత్రం రావాలని ఉండదనుకున్నావా?"

"ఏమండీ! నిజంగా చెప్పండి. ఈ మాటలు గుండెలోంచి వచ్చాయా? గొంతు లోంచి వచ్చాయా?" దుఃఖాన్ని ఆపుకోలేక సీతాపతి ఒళ్ళో వాలిపోయింది తాయారు.

"పిచ్చితాయారూ! మనమూ మనుషులమేననీ, మనకీ మనసనేది ఒకటి ఉంటుందనీ, అందులో కొన్ని ఆశలుంటాయనీ చిన్నచిన్న అనుభూతులే అయినా అవి మనసులో చిరకాలం తిష్టవేసుకుని తలచుకున్నప్పుడల్లా ఆనందాన్నిస్తాయని వాళ్లకిప్పుడు తెలీదే... ప్చ్...తెలిసేటప్పటికి మనం ఉండమేమో..."

చప్పున తన చేత్తో సీతాపతి నోరుమూసి "ఏంటండీ! ఆ మాటలు" అంటూ పైట చెంగు నోట్లో కుక్కుకుంది తాయారు.

"అవును తాయారూ! ఇది తరానికీ తరానికీ మధ్య ఏర్పడుతున్న అంతరం. తరాలు మారుతున్నా అనుభవాలు మారుతున్నాయి కానీ ఆ అంతరం మాత్రం అలాగే కొనసాగుతోంది. అయినా ఇప్పుడు ఒక్క విషయం మాత్రం మనం నిజాయితీగా ఒప్పుకోవాలి" అంటూ తయారు మొహంలోకి చూశాడు.

"ఏంటండీ అది"


"వాడ్ని ఇలా అనుబంధాలూ, అనుభూతులూ లేని బండగా పెంచింది మనమే కదూ!?"

"ఎందుకండీ అలా అంటారు? మనం కడుపు కొట్టుకుని మరీ వాడికి కావలసిన సదుపాయాలన్నీ కలుగజేశాం. వాడు ఒక్కరోజు కూడా దేనికీ బాధపడకుండా ఎంతో ప్రేమగా పెంచాం! ఆ విశ్వాసం అయినా వాడికుండొద్దా?"

"వద్దు తాయారూ! ప్రేమ విశ్వాసం లాంటి పెద్ద పెద్ద మాటలు వాడొద్దు. ఇది మన బాధ్యతగా మనం అనుకున్నాం. అలాగే నాకు కావలసినవి సమకూర్చి పెట్టడం నా తల్లిదండ్రుల బాధ్యత అని వాడూ అనుకున్నాడు. ప్రేమగా పెంచడం వేరు. ప్రేమను పంచి ఇవ్వడం వేరు. మనం వాడ్ని ప్రేమగా పెంచడమే తప్ప ప్రేమను పంచి ఇవ్వలేదేమో!" అలా అంటున్న సీతాపతి కళ్లు నిరామయంగా శూన్యంలోకి చూశాయి కొన్ని క్షణాలు.

ఇద్దరిమధ్యా కొద్దిసేపు మౌనం. మౌనాన్ని ఛేదిస్తూ మ్యూజికల్ గోడ గడియారం ఏడుగంటలని సూచించింది.

"తాయారూ! సందర్భం వచ్చింది కాబట్టి ఒక్కసారి మన పాతరోజులు నెమరువేసుకుందాం. 'ఒక కన్ను కన్నూ కాదు, ఒక బిడ్డ బిడ్డాకాదు!' అనుకునే ఆరోజులలోనే మనం ఒక స్పష్టమైన అవగాహనతో ఒక కొడుకుతోనే కుటుంబనియంత్రణ శస్త్రచికిత్స చేయించుకుని అధిక సంతానానికి చుక్క పెట్టేశాం. ఇంక వాడితో అదే మణికంఠతో ఏం ఆడామో! మూడు సంవత్సరాల వరకే. ఆ తరువాత ఎప్పుడైతే చదువుల సంచి భుజానికి తగిలించి కాన్వెంట్ బాట పట్టించామో ఇంక అక్కడినుంచీ ఏరోజు వాడితో మాట్లాడినా మార్కులు, ర్యాంకులే తప్ప



వాడి ఆటపాటలు గురించి ఏనాడన్నా అడిగామా? సెలవుల్లో కూడా ట్యూషన్లు, కోచింగ్‌లే తప్ప ఎక్కడికన్నా సరదాగా తిప్పామా? గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పు ఈనాడు మన బంధువుల్లో ఎంతమందిని వాడు గుర్తుపట్టగలడో?

అన్నిచోట్లా వాడి గమనాన్ని మనమే నిర్దేశించాం కాదు శాసించాం. అంతే తప్ప వాడి మాటకు గానీ, అభిప్రాయానికీ గానీ ఏనాడన్నా విలువ ఇచ్చామా? సగటు విద్యార్థికి పెద్దభూతంలా చిత్రించబడుతున్న పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో వాడి లక్ష్యం 500మార్కులు దాటటంగా నిర్ణయించాం మనం. పాపం వెర్రినాగన్న ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపాడో ఇంకెంత చిత్తక్షోభ అనుభవించాడో? మొత్తానికి లక్ష్యం దాటి స్టేట్‌ర్యాంక్ కూడా తెచ్చుకున్నాడు.

అలాగే కార్పొరేట్ కాలేజీలో ఫ్రీ సీటు కూడా పొందాడు. ఇంక అక్కడ ఎంసెట్ ర్యాంక్ వాటికి లక్ష్యమయింది. అందులో కూడా వాడు విజయం సాధించి మంచి కాలేజీలో ఇంజనీరింగ్ విద్య కూడా పూర్తిచేశాడు. తరువాత ఎంటెక్‌గా చూడాలని మళ్లీ మనమే వాడికి దిశానిర్దేశం చేశాం. విజయం రుచి తెలిసిన వాడు కాబట్టి అందులోనూ విజయుడై తిరిగి వచ్చాడు..'' ఒక్క క్షణం ఊపిరి తీసుకోడానికి ఆగాడు సీతాపతి.

"అవునండీ! అందుకే మొదట్లోనే నెలకు యాభైవేలు సంపాదించే స్థితికి వెళ్ళాడు'' కొంచెం గర్వం తొణికిసలాడుతుండగా అంది తాయారు.

"నిజమే తయారూ! నా ఉద్యోగజీవితం ఐదువందలతో ప్రారంభమైతే వాడి ఉద్యోగజీవితం యాభైవేలతో ప్రారంభమైంది. అప్పుడు మనుషులను మమతలు శాసించేవి ఇప్పుడు డబ్బులు శాసిస్తున్నాయి అంతే తేడా'' నిర్లిప్తంగా అన్నాడు సీతాపతి.

"ఏంటమ్మా బావగారు ఏమంటున్నారు? ఇంకొన్నాళ్ళు ఉద్యోగం చేయాలనుంది అని అంటున్నారా?'' ఎయిర్‌బ్యాగ్ పక్కన పెడుతూ హాస్యమాడాడు వాసుదేవరావు.

"రారా తమ్ముడూ! నువ్వన్నా సమయానికి వచ్చావు'' ఆనందంతో మొహం విచ్చిన తామరలా అవుతుండగా తమ్ముణ్ణి ఆహ్వానించింది తాయారు.

"అదేంటక్కా! ఇదేమన్నా మళ్లీ మళ్ళీ వచ్చే పండగా? రాకుండా ఎలా ఉండగలను?''

"వాసూ ప్రయాణం బాగా జరిగిందా?'' ఆప్యాయంగా పలకరించాడు సీతాపతి. నిజానికి సీతాపతి, వాసుదేవరావులు బంధువులు అనేకన్నా మంచి మిత్రులు అనడం సముచితంగా ఉంటుంది.

"ఆ! ఏంటి బావగారూ! ఇంతవరకూ స్కూలు, పిల్లలు, పాఠాలతో గడిచిపోయాయి రోజులు. ఇక మీ భవిష్యత్తు కోసం బృహత్తర ప్రణాళికలేమన్నా సిద్ధం చేసుకున్నారా?'' హాస్యమాడాడు వాసు.

"వాసూ! నీకు తెలీనిదేముంది? భగవదనుగ్రహం వల్ల సంసారం ఒక ఒడ్డున పడిందనే అనుకుంటున్నాను. మణికంఠ ఒక స్థాయికి వచ్చాడు. ఉండడానికి ఇల్లు కూడా సమకూరింది. ఇంక తీర్చవలసిన బాధ్యతలంటూ ఏవీ లేవు కదా!

మరి ఈ శేషజీవితానికి ఇంకా ప్రణాళికలెందుకూ? ఏదో మంచి సంబంధం చూసి మణికంఠకి పెళ్లి చేసేసి ఆపై కృష్ణారామా అనుకుంటూ గడిపెయ్యడమే!''

“ఇదిరా తమ్ముడూ వరస. ఈవాళ లేచిందగ్గరనుండీ తన వేదాంతంతో నా ప్రాణాలు తోడేశారనుకో. సమయానికి నువ్వొచ్చి నన్ను బ్రతికించావు. పాపం మా ఆయన మాటలు విని అలసిపోయి ఉంటావు. ఇదిగో కాఫీ సేవించు. తరువాత తీరికగా బావగారి పని పడదాం'' నవ్వుతూ కాఫీ గ్లాసందించింది తాయారు.

“సరి సరి...మీ అక్కాతమ్ముళ్ళిద్దరూ కలిస్తే ఇంక నా పని హరిలో రంగ హరే'' నవ్వుతూ చేతులు పైకెత్తి చిడతలు వాయిస్తున్నట్లు అభినయించాడు సీతాపతి.

“ఏంటి బావగారూ! హరిలో రంగ హరి అని తత్త్వాలు ప్రాక్టీస్ చేస్తున్నారు. కొంపతీసి సన్యాసం పుచ్చుకుంటారా ఏమి?''

“మనం పుచ్చుకోనక్కరలేదోయ్. ప్రభుత్వమే ఈ సాయంత్రం నుండి సన్యాసం ప్రకటించేస్తుంది'' అలా అంటున్నప్పుడు సీతాపతి గొంతులో చిన్న అదిరిపాటు.

* * *

'ఎందరో మహానుభావుల పదవీ విరమణకు తను ప్రత్యక్షసాక్షి అయినా తనకు మాత్రం విరమణ లేదు' అనుకుంటూ పశ్చిమాన ముడుచుకుంటున్నాడు సూర్యుడు.

పాఠశాల ఆవరణ రంగురంగుల విద్యుద్దీపాలతో వెలుగులీనుతోంది.

సభావేదికపై ముఖ్య అతిధుల మధ్య గంభీరంగా ఉన్నాడు సీతాపతి. అతను ధరించిన పట్టు పట్టుపంచె లాల్చీ అతనికి మరింత హుందాతనాన్ని ఆపాదించాయి.

సీతాపతి చేతిలో రూపుదిద్దుకున్న ఎన్నో శిల్పాలు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఉపాధ్యాయులుగా, వివిధ హోదాలు కలిగిన అధికారులుగా ఒద్దికగా ఇమిడిపోయి ఆ వేడుకకే ఒక వేడుకను తెచ్చాయి.

ఆ ఆవరణలోని ఆహూతులతో పాటూ అణువణువూ అనిర్వచనీయమైన అనుభూతికి లోనై ఉన్నాయి.

వీడియోగ్రాఫర్‌కి సూచనలిస్తూ ఏర్పాట్లలో తలమునకలైపోయాడు వాసు.

సభ ప్రారంభమైంది. సీతాపతి అంకితభావం, శిష్య వాత్సల్యం, మానవీయ కోణం, అనేకానేక ఉదాహరణలతో వక్తల వాక్ ప్రవాహరూపంలో అందరి మనసులనూ మరోసారి స్పృశించాయి. జ్ఞాపకాల జడిలో అందరిమనసులూ తడిశాయి.

తరువాత జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన శిష్యబృందం చేసిన హడావిడి అంతా ఇంతాకాదు. కార్యక్రమం తర్వాత ముగ్గురూ ఇల్లు చేరుకున్నారు భారమైన హృదయాలతో. ముగ్గురి మనసులలోనూ ఒకటే వెలితి. అదే మణికంఠ రాలేకపోవడం.

సభలోని వక్తలమాటలు, శిష్యుల అనుభవాలు సీతాపతి మెదడు పొరలలోనికి జారిపోయిన ఎన్నో స్మృతులను తిరిగి హృదయఫలకంపై ప్రతిఫలింపచేశాయి. అతని మనసంతా ఆర్ద్రమై మాటిమాటికీ కన్నీరు ఉబకసాగింది.

బావగారి మనసును అర్థం చేసుకున్న వాసు మనసు మరల్చడానికి టీవీ ఆన్ చేశాడు.

'పుట్టినరోజు పండగే అందరికి
మరి పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికి' టీవీలో పాట వస్తోంది. సీతాపతి మనసరు అప్రయత్నంగా ఆ పాటపై నిమగ్నమైంది. అబ్బ! ఎంత చక్కని సందేశం ఇచ్చారు ఆ పాటలో.

అందరూ నిద్రకు ఉపక్రమించారు. సీతాపతికి మాత్రం నిద్రరావడం లేదు. నెమ్మదిగా లేచి డాబా పైకి వెళ్లాడు. సూర్యకిరణాలతో అలసిన లోకం చంద్రకిరణాలలో సేదతీరుతోంది. రణగొణ ధ్వనులతో విసిగిన పరిసరాలు మౌనముద్రను దాల్చాయి.

కాసేపు డాబాపై అటూ ఇటూ పచార్లు చేసి వీధి వైపు పిట్టగోడనానుకుని నిల్చున్నాడు.

సరిగ్గా అప్పుడే అతని దృష్టిని ఆకర్షించింది ఓ దృశ్యం.

భుజం మీద పెద్ద గోనె సంచీ పట్టుకుని చిత్తుకాగితాలు ఏరుకుంటున్నాడో పదమూడేళ్ల కుర్రాడు చెత్తకుండీలో కనిపించిన పుస్తకాన్ని తీసుకుని వీధి దీపం వెలుగులో దాన్ని పరిశీలించి ఒకసారి కళ్లకద్దుకుని రెండో భుజంపై వేలాడుతున్న గుడ్డ సంచీలో దాచుకున్నాడు.

ఆ కుర్రాడి అకుంఠిత దీక్షకు అబ్బురపడ్డాడు.

మరుక్షణమే కళ్లు చెమర్చాయి.


## కలల ప్రేమికులు

ఐదేళ్ల క్రితం డేవిడ్ బ్రౌన్ ఉదయానే లేచినప్పుడు హఠాత్తుగా కలలో మాదిరి ఏదో మొబైల్ ఫోన్ నెంబర్ స్ఫురించిందిట. రాత్రి జరిగిన పార్టీలో ఏ ఫ్రెండయినా ఆ నెంబర్ తనకిచ్చాడేమోనని ఆ నెంబర్‌కి 'మనం కానీ గతంలో కలుసుకున్నామా?' అన్న మెసేజ్ పంపాడట. ఇంతకీ ఆ నెంబర్ అతనికి 60 మైళ్ల దూరంలో వుంటున్న 17 సంవత్సరాల మైఖేల్ కిట్సన్ అనే అమ్మాయిది. ఆమె బదులివ్వకపోయినా తనకీ ఫోన్ నెంబర్ తరచూ ఎందుకు గుర్తుకొస్తోందో అర్థం కావడంలేదంటూ అతను అదే పనిగా ఆమెకు మెసేజ్‌లు పంపసాగాడు. మరి ఆ మాటలకి ఆమె ప్రభావితమైందో లేక విధి లిఖితమోగానీ ఆ అమ్మాయి డేవిడ్‌కు ఫోన్ చేయకుండా ఉండలేకపోయింది. ఆ తరువాత వాళ్ల మధ్య మాటలు, మెసేజ్‌లు ఎంత వేడివేడిగా కొనసాగాయంటే వాళ్లింక కలుసుకోకుండా ఉండలేకపోయారు. అంతే! వాళ్లది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అయిపోయింది. ఐదేళ్లపాటు డేటింగ్ చేసుకున్న ఆ ప్రేమ జంట భార్యాభర్తలయి కేంబ్రిడ్జి దగ్గర స్థిరపడ్డారు.

## చైనాలో మారుతున్న సంస్కృతి

ఇటీవల చైనాలో సాంప్రదాయకమైన మార్పులు తిరిగి వస్తున్న నేపథ్యంలో వెడ్డింగ్ కల్చర్‌ని పెంపొందించడానికి షాంఘై నగరంలో మోడల్ ఝుజంగ్ 100 మీటర్ల పొడవైన వెడ్డింగ్ డ్రెస్సును ధరించి వందలాదిమందిని ఆకర్షించింది.

-విమలారామం



సమాజంలో అటువంటివాళ్ళు ఎందరో? ఏ కనిపించని చీకటికోణాలు వాళ్ల జీవితాల్ని కాలరాసేస్తున్నాయో!

'ప్రతిమనిషీ తన జన్మకు పరమార్థం తెలుసుకుని..'పాట సీతాపతి చెవుల్లో గింగుర్లు కొడుతోంది.

అటువంటివాళ్లలో కొందరికైనా అవకాశం కల్పిస్తే?

అవును చుట్టూ చీకటి అలుముకున్నప్పుడు చేతిలోని చిరుదీపం మొత్తం చీకట్లను పారద్రోలకపోయినా కొంతమేరకైనా వెలుగును నింపుతుంది కదా!

క్రమంగా అతని మొహంలో చిరునవ్వు విచ్చుకుంది.

"మీ భవిష్యత్తు కోసం బృహత్తర ప్రణాళికలేమన్నా సిద్ధం చేసుకున్నారా?" ఉదయం వాసు మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

'వాసూ ఉదయం నువ్వడిగేప్పటికి నీ ప్రశ్నకు సమాధానం నా దగ్గరలేదు కానీ ఇప్పుడిప్పుడే ఆ ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది' మనసులోనే అనుకుంటూ మెట్లు దిగసాగాడు సీతాపతి.

సీతాపతి నిర్ణయానికి వాసు తాయారులు కూడా కొంత చర్చ తరువాత ఆమోదముద్ర వేశారు. మరుసటిరోజు నుండే సీతాపతి తన నూతన కార్యక్రమానికి నడుం బిగించాడు.

ముందు తన ఖాళీ సమయాల్లో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ అనాథ బాలల వివరాలు సేకరించసాగాడు.

వారిలో అర్హులైనవారికి ప్రభుత్వం వారు ఏర్పాటుచేసిన బ్రిడ్జి స్కూల్స్‌లో చేర్పించే ఏర్పాట్లు చేస్తున్నాడు.

డాబాపై తాత్కాలికంగా ఒక రేకుల షెడ్డు వేసి చదువుకొనలేని విద్యార్థులకు తన పరిధి మేరకు ఉచితంగా విద్యాబోధన ప్రారంభించాడు.

* * *

ఏదైనా ఒక కార్యక్రమం కొత్తగా ప్రారంభించినప్పుడు మొదటిదశలో జనం దానిగురించి వింతగా చెప్పుకుంటారు. తమ విమర్శలతో దాన్ని నీరుకార్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తారు.

రెండోదశలో దాని గురించి ఆలోచిస్తారు. తమలో తాము చర్చించుకుంటారు. మూడోదశలో వారిలో కొందరైనా ఆ కార్యక్రమం పట్ల ఆకర్షితులవుతారు.

ప్రస్తుతం సీతాపతి కార్యక్రమం మూడోదశకు చేరుకుంటున్నది. సీతాపతి శిష్యులూ, ఆప్తులూ స్నేహహస్తాన్ని చూపుతున్నారు.

* * *

ఆరోజు ఉదయం బాలభానుడు తన అరుణారుణ కిరణాలతో లోకానికి మేలుకొలుపు పాడుతున్న వేళ-కాలింగ్‌బెల్ మోతకు కళ్ళు తెరిచి నెమ్మదిగా కళ్ళు నులుముకుంటూ వచ్చి తలుపుతీసింది తాయారు.

ఎదురుగా మణికంఠ.

ఆశ్చర్యంతో తలమునకలవుతూ "ఏమండీ! అబ్బాయి వచ్చాడండీ!" అంటూ లోనికి కేకేసింది ఆనందంతో.

సీతాపతి చప్పున మంచం దిగి వచ్చి "ఏరా బాగున్నావా?" ఆప్యాయంగా పలకరించాడు.

"ఏంట్రా? ఇంత హఠాత్తుగా చెప్పాపెట్టకుండా వచ్చావు! ఆరోగ్యం బాగుంది కదా!" తాయారు మాటల్లో ఆప్యాయతా, ఆందోళనా తొంగిచూశాయి.

"ఆహా! నేను నిక్షేపంగా ఉన్నాను" చెరగని చిరునవ్వుతో అన్నాడు మణికంఠ.

"ఏం కన్నా! ఏనీ ప్రాబ్లమ్?" సీతాపతి గొంతులో ఆరా.

"నథింగ్ డాడీ! మీ నిర్ణయం నన్నూ ఆలోచింపచేసింది. రాత్రనకా పగలనకా కష్టపడి ఏదో ఒక కంపెనీ భాగ్యాన్ని పెంచేదానికన్నా దేశసౌభాగ్యాన్ని పెంచే మీ బృహత్తర ప్రణాళికలో నన్నూ పాలుపంచుకోమని ప్రేరేపించింది. ఎప్పటినుండో తమ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరమని ఇక్కడకు దగ్గరలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీ వాళ్ళు నాకు కబురు పంపుతూనే ఉన్నారు. అందుకే ఆ కాలేజీలో చేరి నా ఖాళీ టైంలో మీకు తోడుగా ఉండాలని అనుకున్నాను. నేను పనిచేస్తున్న కంపెనీకి రాజీనామా సమర్పించి వచ్చేశాను. నాన్నా మీతో సంప్రదించకుండా నేను తీసుకున్న తొలి స్వతంత్ర నిర్ణయం ఇదే. నా నిర్ణయం తప్పైతే నన్ను క్షమించండి" అంటూ సీతాపతి పాదాలను తాకాడు మణికంఠ.

తనకంటే ఎదిగిపోయిన కొడుకును ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు సీతాపతి.

ఆ పుత్ర పరిష్వంగంలోని ఆనందానికి అతని కళ్ళు చెమర్చాయి.

★



## దటీజ్ సిమ్రాన్...!

పెళ్లయిన తరువాత సినిమాలకు గుడ్‌బై చెప్పి, తిరిగి సినిమాల్లోకి వచ్చే హీరోయిన్లు వదిన, అక్క, తల్లి లాంటి పాత్రల్లో సెటిలైపోతారు. కానీ సిమ్రాన్ విషయం అందుకు పూర్తిగా భిన్నం. పెళ్లయి, తల్లయ్యాక కూడా తాను హీరోయిన్‌గానే నటిస్తానంది. మళ్లీ హీరోయిన్‌గా ఆమెకు ఎవరు అవకాశం ఇస్తారని చాలామంది వ్యాఖ్యానించారు కూడా. కానీ 'ఒక్క మగాడు'లో ఒక హీరోయిన్‌గా నటిస్తున్న సిమ్రాన్, మలయాళ చిత్రంలో కూడా కథానాయికగా నటిస్తోంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా హీరోయిన్‌గానే కంటిన్యూ అవుతానన్న సిమ్రాన్ తన మాటను నిలబెట్టుకుంది. ఆల్ ది బెస్ట్!

